# కొత్త కథ

అలపర్తి
వెంకటసుబ్బారావు

పండువెన్నెల, పిండారబోసినట్టుగా వుంది. కన్నులపండుగగా వుంది. మంచంమీద కూర్చొని వున్న తాతయ్య, ఆరిపోయిన చుట్టని తిరిగి ముట్టించాడు. మంచంలో పడుకున్న మనుమడు, కథ చెప్పమని తాతయ్యనడిగాడు. తాతయ్య చెప్పేకథ వింటూ నిద్రపోవడం మనుమడికి అలవాటు! ఇంకేం! తాతయ్య కథ మొదలుపెట్టాడు...

"అనగనగా ఒక రాజు..."

"ఊఁ"

"ఆ రాజుకి ఏడుగురు కొడుకులు"

"ఊఁ"

"ఏడుగురు కొడుకులూ ఏటికెళ్లారు."

"ఎప్పుడూ యీ కథేనా? క్రొత్త కథ చెప్పు తాతయ్యా!"

అయితే, యీ కథనే యిక్కడినుంచి మరోదారి త్రొక్కిద్దాం!"

"సరే!"

"ఆరుగురు కొడుకులు ఆరు చేపలు తెచ్చారు."




"ఏడుగురు కొడుకులు తాతయ్యా!"

"అవును ఏడుగురే! కాని, ఏడో వాడు ఏమీ దొరకలేదని ఏడుస్తూ వచ్చాడు..."

"ఎందుకని దొరకలేదు తాతయ్యా?"

"ఇదుగో! మళ్లీ నువ్వు వెనుకటి కథలోకి వెళ్తున్నావ్! కాసేపు ఓపిక బట్టివింటే, ఎందుకు దొరకలేదో నీకే తెలుస్తుంది."

"సరే! తర్వాత?"

"—'ఏరా అబ్బాయ్! ఎందుకు ఏడుస్తున్నావ్?' అని రాజు అడిగాడు 'నాకు చేప దొరకలేదు' అన్నాడు ఏడో కొడుకు ఏడుస్తూనే"

"చేప ఎందుకు దొరకలేదని రాజు అడుగుతాడు ఆ అబ్బాయి అసలుసంగతి చెబుతాడు. అంతేగా తాతయ్యా?"

"ఇంకా నువ్వు పాతకథని విడిచిపెట్టలేదు. ఇది క్రొత్తకథ! గనుక, ఇందులో... చేపా! చేపా! నువ్వెందుకు ఎండలేదు? దుబ్బు అడ్డం వచ్చింది —దుబ్బా! దుబ్బా! నువ్వెందుకు అడ్డం వచ్చావ్? ఆవు మేయలేదు–ఆవూ! ఆవూ! నువ్వెందుకు మేయలేదు?...అనేమాదిరిగా కథ నడవదు."

"పోనీ...తర్వాత ఏం జరిగిందీ గబగబా చెప్పు తాతయ్యా!"

"మరి, మధ్య మధ్య నువ్వు యిలా చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకుండా వుండాలి!"

"అలాగే తాతయ్యా!"

"ఆఁ అన్నట్టు మనం ఎంతవరకు వచ్చాం?"

"నాకు చేప దొరకలేదన్నాడు ఏడో కొడుకు ఏడుస్తూనే!"

"ఇంకేం! రాజుకు కోపం వచ్చింది. కారాలు మిరియాలు నూరుతూ ఏటిదగ్గరికెళ్లాడు. ఏటిలోని చేపలనుద్దేశించి, 'ఏటిలోని చేపల్లారా! నేనెవరో తెలుసా? ఈ దేశాన్ని పరిపాలించే రాజును! ఈ దేశంలోని జీవరాసులన్నీ నా ఆజ్ఞను జవదాటరాదు' అన్నాడు. 'తెలుసు మహారాజా! తెలుసు కాని, మీ రిప్పుడిక్కడికి ఎందుకు వచ్చినట్టు?...మా వలన జరిగిన అపరాధం ఏమిటి? తెలియజెప్పండి రాజా!' అని అడిగాయ్ చేపలన్నీ ఒక్కసారిగా–'ఇవ్వాళ మా కుర్రవాళ్లు ఏడుగురూ ఏటికొచ్చారు. అందులో ఆరుగురికి ఆరు చేపలు దొరికాయ్! ఏడోవాడికి మాత్రం ఏ ఒక్క చేపాదొరకలేదు ఏడుస్తూ యింటికొచ్చాడు. ఏం? రాజకుమారుడు గదా! మీలో ఒక్కటైనా వాడికి చిక్కగూడదూ? వాడేం పట్టుకెళ్ళి మిమ్మల్ని కూరవండుకు తింటాడా?...చక్కగా గాజు తొట్టిలో వుంచి కావలసిన ఆహారం



# నరసాపురం రేవు

చిత్రకారుడు : ఎమ్. నీలకంఠం, కాకినాడ.

పెడుతూ వుంటాడాయె' పెద్దవాళ్ళు ఆరుగురూ పట్టుకొచ్చిన ఆరుచేపలూ ఇకనుంచి హాయిగా రాజాల్లాగా జీవిస్తాయ్!' అన్నాడు రాజు కొంచెం కోపికనబరుస్తూ—ఏం బాబూ! ఊఁ కొట్టడం లేదు. నిద్రవచ్చిందా?"

"లేదు తాతయ్యా! వింటున్నాను చెప్పు!"

"ఉండు. మళ్ళీ ఒక్కసారి యీ చుట్ట ముట్టించనీ!...బాబూ! ఇక తర్వాత కథ చెబుతున్నా వినూ!... అప్పుడు ఒక పెద్దచేప ముందుకొచ్చి యిలా అంది. 'మహారాజా! మీరు చెప్పింది బాగానేవుంది.. కాని, మా మాటలు కూడ మీరు వినాలి. ఎర వేసి చేపను పట్టడం అన్న విషయం ఎల్లరికీ తెలిసినవిషయమే! వస్తావు పోతావు నాకోసం! వచ్చి కూర్చున్నాడు నీకోసం!! అని ఎర ఎంతగా మొఱబెట్టుకున్నా, మేము దాని మాట పెడచెవినిబెట్టి, కోరి గాలం గొంతులో గ్రుచ్చుకుంటాం! అలాంటప్పుడు—గాలానికి ఎర తగిలించి ఏటిలో వేస్తే, ఎంత ఆత్మనిగ్రహంతో వున్నా, ఏదో యొకటి కాలం ముంచుకొచ్చి గాలం ముందుకొచ్చి పట్టుబడక పోదు. అలాగాక, ఏటి ఒడ్డున చెట్టునీడన నిద్రబోతూవుంటే చేపలు వాటంతటవే అతనిదగ్గరికి పరుగెత్తుతాయా? మహారాజా! దేనికైనా ప్రయత్నం అంటూ ఒకటుండాలిగా! కాకపోయినా, స్వేచ్ఛలేని రాజభోగాలుమాత్రం దేనికి ప్రభూ' —పాపం! రాజు ఇంకేం మాట్లాడతాడు! చిన్న కొడుకు నిద్రమత్తును ఎలా వదిలించడమా అని ఆలోచిస్తూ యింటికెళ్లాడు."

తాతయ్య, కథముగించి మనుమడ్ని చూశాడు. వాడు అప్పటికే నిద్రాదేవి ఒడిలో హాయిగా నిద్రపోతున్నాడు. ★